క్లుప్తంగా

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

భద్రాచలంటౌన్: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు లెర్నర్స్ లైసెన్స్ డ్రైవింగ్ లైసెన్స్ వాహనాలు రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి రోడ్డు భద్రత నియమాలు పాటించాలని భద్రాచలంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య తెలిపారు. భద్రాచలం యూనిట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆయన రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదాలు జరిగిన ప్రాణ నష్టం జరగకుండా హెల్మెట్, సీట్ బెల్ట్ రక్షిస్తుందని, తప్పనిసరిగా ధరించాలని సూచించారు. అదేవిధంగా 18 ఏళ్ల లోపు పిల్లలు (మైనర్లకు) వాహనాలు నడుపుట చట్టరీత్యా నేరమని, మైనర్లకు వాహనాలు ఇవ్వొదని ఆయన కోరారు.

హెల్మెట్ తప్పనిసరి..

దుమ్ముగూడెం: ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పక ఉపయోగించాలని సీఐ అశోక్ సూచించారు. సోమవారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా లక్ష్మీనగరం గ్రామంలో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడిన వారి ఫోటోలను చూపిస్తు వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గత 2024 సంవత్సరంలో మండలంలో అన్ని రకాల రోడ్ యాక్సిడెంట్ కేసులు 17 నమోదయాయని, మొత్తం 12 మంది వాహనదారులు చనిపోయారని తెలిపారు. చనిపోయిన వారిలో అందరూ హెల్మెట్ లేకపోవడం వల్ల తలకు బలమైన గాయాలు తగిలి చనిపోయారని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.గణేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ హామీని అమలు చేయాలి

మణుగూరురూరల్: ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్‌లో పొందుపర్చిన విధంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గభ్యుడు బోగే చందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మణుగూరులో జరిగిన ఓబిసి మండల మోర్చా కమిటీ అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ హామీ అమలు కోసం ఈ నెల 7వ తేదీన తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఓబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మీసాల దుర్గారావు, కుంట భద్రయ్య, పోతురాజు వెంకటరావు, ఎం.వెంకటాచారి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు సుందరీకరణకు అనుమతులివ్వాలి

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలోని ఊర చెరువు సుందరీకరణకు ప్రభుత్వపరంగా అనుమతిలివ్వాలని రోటరీ ఇంటర్నేషనల్ 3150 డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి కోరారు. సోమవారం బూర్గంపాడు తహసీల్దార్ ముజాహిద్‌ను రోటరీ ప్రతినిధులతో కలసి చెరువు సుందరీకరణకు ప్రభుత్వపరంగా అనుమతిలివ్వాలని కోరారు. రూ.30లక్షల నిధులతో చెరువు సుందరీకరణ పనులను రోటరీ క్లబ్ చేపడుతుందన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ గ్లోబల్ విసార్డ్స్ అధ్యక్షుడు నంబూరి వెంకటరాజు, రోటేరియన్ పోరూరి సురేష్ పాల్గొన్నారు.

దేవాలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలోని చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయ దేవస్థానం నూతన పాలవర్గ కమిటీని నియామకం చేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు దేవస్థానం కమిటీ నూతన చైర్మన్‌గా ఇదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకులు నరాల శ్రీనివాసరావును నియమించగా, కమిటీ ధర్మకర్తలుగా జక్కుల జగదీష్, ఆలపాటి నరేంద్ర, ఇళ్ల నాగేంద్ర, ఇళ్ల నిర్మల, నారం జగదీష్, నల్లగల్ల వెంకటేష్, ఎక్స్ ఆఫీషియో మెంబర్‌గా మేడూరి సాంబ శివ ప్రసాద్‌వర్మ నియమితులయ్యారు. దీంతో నూతన ఆలయ చెర్మన్, ఆలయ ధర్మకర్తలను సోమవారం స్థానిక ఆలయంలో కొత్తగూడెం డివిజనల్ ఇన్స్పెక్టర్ బెయిల్ సింగ్, ఆలయ ఈఓ సూర్య ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయించారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

అశ్వారావుపేటరూరల్: కాంగ్రెస్ ఎన్నికల హామీ ప్రకారం రైతులకు షరతులు లేకుండా తక్షణమే పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) మండల కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐయూకేఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీటీకు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం తక్షణమే మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంగాల కల్లయ్య, గోకినపల్లి ప్రభాకర్, వాసం బుచ్చిరాజు, కణితి గోపాలరావు, గొంది లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

పంచాయతీల బలోపేతానికి కృషి

- గ్రామాల్లో ఎమ్మెల్యే జారే పర్యటన
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- సమస్యల పరిష్కారంపై అధికారులకు దిశానిర్దేశం



దమ్మపేట: లింగాలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే

అశ్వారావుపేటరూరల్: అభివృద్ధికి కేంద్రాలైన గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ ప్రభుత్వం బలోపేతం చేస్తుందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జీపీలను విస్మరించారని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. సోమవారం మండలంలోని మద్దికొండ, నారంవారిగూడెం కాలనీ, అల్లిగూడెం, అశ్వారావుపేట గ్రామ పంచాయతీల నూతన భవనాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. అలాగే మద్దికొండ, కొత్త నారంవారిగూడెం గ్రామాల్లో సీసీ రోడ్లను, మొద్దులగూడెం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలు సమస్యల పరిష్కారానికి వేదిక కావాలని అన్నారు. పంచాయతీల బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అనంతరం వినాయకపురం గ్రామంలోని చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు చేసి, నూతన కమిటీ బాధ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్ నరాల శ్రీనివాస్‌తోపాటు ఆలయ ధర్మకర్తలకు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు తుమ్మా రాంబాబు, జూపల్లి రమేష్‌బాబు, మొగళ్లపు చెన్నకేశవరావు, జూపల్లి ప్రమోద్, సత్యనారాయణ చౌదరి, మిండా హరిబాబు, నార్లపాటి దివాకర్ పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

దమ్మపేట: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్పష్టం చేశారు. మండల పరిధిలో సోమవారం విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే జారే, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల పరిధిలోని మారప్పగూడెం, అర్లపెంట గ్రామాల్లో 20 లక్షల రూపాయల ఉపాధి హామీ నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయితీ భవనాలను, ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. దమ్మపేట, నాగుపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న అంగన్‌వాడీ భవనాలకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. లింగాలపల్లి, తొట్టిపంపు గ్రామాల్లో నూతనంగా మంజూరైన సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. లింగాలపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజరూపంలో పర్ణశాల రామయ్య



శ్రీరామావతారంలో పర్ణశాల రామయ్య

దుమ్ముగూడెం: పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా 7వ రోజు సోవారం రామయ్యను నిజరూప దర్శనం శ్రీరామావతారంలో ఆలయ అర్చకులు అలంకరించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలను, అభిషేకాలను నిర్వహించిన అర్చకులు అనంతరం స్వామి వారిని శ్రీరామావతారంలో అలంకరించారు. లోకకంటకుడైన రావణ కుంభకర్ణాది రాక్షసులను సంహరించడానికై దశరథుని కుమారుడగా శ్రీమన్నారాయణుడు ధరించిన అవతారం శ్రీరామాడితారం. సూర్య గ్రహబాధలున్న వారు రామావతారాన్ని దర్శించడం వల్ల ఆ బాధల నుంచి విముక్తి పొందుతారని అర్చకులు వివరించారు. సాయంత్రం సంపూర్ణ కోలాటం బృందం తరుపున కోలాటం, వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ తిరువీధి సేవ నిర్వహించారు. నేడు బలరామావతారంలో దర్శనం ఇవ్వనున్న స్వామివారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, భార్గవాచార్యులు, వేదపండితులు మల్లూరు రవికుమార్ శర్మ, నాలదీగల నరసింహాచార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజచార్యులు, ఆలయ సిబ్బంది శివ, రాము పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని తోగ్గూడెం పంచాయతీ కార్యాలయంలో ప్రజల సమక్షంలో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను అడిగి సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అధికంగా డ్రెయినేజీ, తాగునీరు, విద్యుత్, చెరువుల ఆధునీకరణ, రాజకీయాలకతీతంగా అర్హులను ఎంపిక వంటి అంశాలను గ్రామస్తులు ఎమ్మెల్యేకు దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తుందన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు కల్పిస్తామని ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని ప్రజాభవన్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, వైద్య, విద్య, విద్యుత్ శాఖల విభాగాల అధికారులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న నరాటి వెంకన్న

గుండాల: తాత ముత్తాతల కాలం నుంచి ఏజెన్సీలో కుల వృత్తిని నమ్ముకుని కల్లుగీస్తూ జీవనం కొనసాగిస్తున్న గౌడుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఏజెన్సీ గౌడు కులస్థుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ నరాటి వెంకన్న పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం గౌడు కులస్తుల ఆత్మీయ సమ్మేళనం బత్తిని సాయన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ ఏజెన్సీ ప్రాంతాల గౌడు కులస్తులకు కల్పించిన ఆర్టికల్ 342, 5వ షెడ్యూల్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో ఉన్న గౌడుల కుటుంబాలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోవాల్సివస్తుందన్నారు. కనీసం వృత్తి లైసెన్సులు ఉంటే కలుగీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా, పింఛన్లు, రుణాలు వచ్చే అవకాశాలున్నాయన్నారు. ఈ సందర్భంగా గౌడు కులస్తుల పరిరక్షణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యాసారపు సురేష్, కార్యదర్శి మాచర్ల రంజిత్, మరో తొమ్మిది మందితో కమిటి వేశారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు కొత్త వెంకటేశ్వర్లు, మండా రాజన్న, ఉమ్మగాని సత్యం, బత్తిని రాంమూర్తి, మాచర్ల సత్యం, శ్రీరాం కోటయ్య, బస్వ వెంకన్న, యాసారపు వెంకన్న, యాసారపు తిరుపతి, మొక్క నరెందర్, గుండెబోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలోని ఏఆర్టీ సెంటర్‌లో కాంట్రాక్టు పద్ధతిలో మెడికల్ ఆఫీసర్ పోస్టును భర్తీ చేయనున్నట్లుగా భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీబీఎస్ పూర్తి చేసి ఆసక్తి గల అభ్యర్థులు నేటి నుంచి 12వ తేదీ వరకు రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏరియా ఆస్పత్రిలోని రూమ్ నంబర్ 38లో దరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు. ఎంపికైనా అభ్యర్థులకు నెలకు క్రాంటాక్టు పద్ధతిలో రూ.72వేలు జీతం ఇవ్వనున్నట్లుగా ఆయన తెలిపారు. సందేహాలు ఉంటే 9963130775 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

గురుకులాల్లో ప్రవేశాలకు..

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో 2025–26 విద్యాసంవత్సరానికి గాను 5వ, తరగతి విద్యార్థుల నుంచి ప్రవేశ పరీక్ష దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అన్నపురెడ్డిపల్లిలోని గిరిజన సంక్షేమ కళాశాల ప్రిన్స్‌పాల్ ఎస్.చైతన్య సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు రూ. 100లు పరీక్ష రుసుముతో ఫిబ్రవరి 1వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫిబ్రవరి 23న, ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ముగ్గుల పోటీలకు ఆహ్వానం

మణుగూరురూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్, తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు బాడిశ సతీష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో బహుమతులతో పాటు పాలొన్న ప్రతీ ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పేర్ల నమోదుకు 7032277525 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

అటవీ అధికారుల సర్వే

అశ్వాపురం: మండల పరిధిలోని మారుమూల గ్రామమైన రాయన్‌పేట గ్రామానికి రహదారి నిర్మాణంపై సోమవారం ఫారెస్ట్ అధికారులు సర్వే చేపట్టారు. మణుగూరు రైల్వే స్టేషన్ నుండి రాయన్‌పేట వరకు బీటీ రహదారి నిర్మాణానికి ఐటీడీఏ ద్వారా ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు కాగా అటవీ శాఖ అనుమతులు రాలేదు. ఫారెస్ట్ అధికారులు సర్వే చేశారు.

యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడికి సన్మానం

అశ్వాపురం: ఇటీవల మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన గొల్లపల్లి నరేష్‌ను మాల జన సమితి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాల జన సమితి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెట్టి సురేష్, మండల యూత్ ప్రెసిడెంట్ ధ్రువకుమార్, నాయకులు మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

మణుగూరుటౌన్: నాలుగు రోజుల క్రితం ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన కార్మికుడిని దొంగచాటుగా భద్రాచలం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్సలందించిన ఓసీ–4 దుర్గా ఓబీ కంపెనీపై చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు అన్నారు. సోమవారం ఆయన బ్రాంచి కార్యదర్శి గట్టయ్యతో కలిసి మాట్లాడుతూ...కంపెనీ స్థాయిలో చిన్న ప్రమాదం జరిగితే ఎంక్వైరీల పేరుతో సూపర్‌వైజర్లను బాధ్యులను చేసే యాజమాన్యం.. ఇంత ప్రమాదం జరిగినా గోప్యత పాటించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఓసీ–4 దుర్గా ఓబీ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ముష్టి గింజలు పట్టివేత

కరకగూడెం: మండల పరిధిలోని అనంతారంలో ఆదివారం అర్ధరాత్రి అటవీ సిబ్బంది తనిఖీ చేస్తుండగా ముష్టి గింజలను చర్ల వైపు అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని సీజ్ చేశారు. నిందితుడు బోడ నాగరాజుపై అనంతారం ఫారెస్ట్ సెక్షన్ అధికారి గోవింద్ కేసు నమోదు చేశారు. సుమారు 15 క్వింటాళ్ల ముష్టి గింజలతో పాటు చిల్ల గింజలను కూడా స్వాధీనం చేసుకుని ఏడూళ్ల బయ్యారం రేంజ్ కార్యాలయానికి తరలించారు. వాటి విలువ రూ.63 వేలు ఉంటుందని గోవింద్ తెలిపారు. తనిఖీల్లో బీట్ ఆఫీసర్ రోజా, బేస్ క్యాంపు సిబ్బంది రాంబాబు, గణేష్, సాంబ పాల్గొన్నారు.

కఠిన చర్యలు తప్పవు

అశ్వారావుపేటరూరల్: సంక్రాంతి, ఇతర పండుగల పేర్లతో కోడి పందేలు, పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని సోమవారం అశ్వారావుపేట ఎస్సై టీ యయాతి రాజు ఓ ప్రకటనలో తెలిపారు. సంప్రదాయ క్రీడలతో పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించే లేదని నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. కోడి పందేలు, కోడి కత్తుల తయారీదారులు, పేకాట నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేయడంతోపాటు నిఘా ఉంచుతామని చెప్పారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

ములకలపల్లి: ఉపాధ్యాయ సంఘ పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ సత్యనారాయణ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మార్సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘ మండల అధ్యక్షుడు పూర్ణ, ప్రధాన కార్యదర్శి సీతారాం, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు వి.శ్రీదేవి, రాష్ట్ర కార్యదర్శులు బి.నారాయణ, వి.దస్రు, డి.శంకర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రామస్వామి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

దమ్మపేట: వాసవీ క్లబ్ గ్రేటర్, దమ్మపేట నూతన కార్యవర్గాన్ని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్ దారా మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రేటర్ దమ్మపేట క్లబ్ అధ్యక్షుడిగా మండవల్లి సురేష్, ప్రధాన కార్యదర్శిగా చారుగుండ్ల ప్రదీప్, కోశాధికారిగా దొడ్డా వినోద్‌కుమార్, ముఖ్య సలహాదారుడిగా దారా ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు, దమ్మపేట ఆర్యవైశ్య సంఘం తరపున అభినందనలు తెలియజేశారు.

ఆలయ కమిటీ చైర్మన్‌కు సన్మానం



డాక్టర్ సుదర్శన్ రావు దంపతులను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లోని అభయాంజనేయ స్వామి గుడి ఆలయ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సుదర్శన్ రావు, జయభారతీ దంపతులను సోమవారం భద్రాచలం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టు సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భద్రాచలం శాఖ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు పరిమి సోమశేఖర్ మాట్లాడారు. భద్రాచలం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ డివిజన్ కార్యదర్శి చల్లగుళ్ల నాగేశ్వరరావు, కోశాధికారి మురళీమోహన్, కమిటీ సభ్యులు, కెమిస్టులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

ములకలపల్లి: మండలకేంద్రంలోని వైఎస్సార్ నగర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ స్థానికులు సోమవారం తహసీల్దార్ గుడ్ల పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా కాలనీలో జీవనం సాగిస్తున్నా కరెంట్ మీటర్లు ఇవ్వట్లేదని, ఇంటిపన్ను రసీదుకు నోచుకోలేదని వాపోయారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

‘మారెళ్లపాడు’ ఆయకట్టుపై డ్రోన్ సర్వే



డ్రోన్ సర్వే చేస్తున్న సంస్థ సిబ్బంది

అశ్వాపురం: అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు గ్రామంలోని సీతారామ ప్రాజెక్ట్ ఫేజ్–1 పంప్‌హౌస్ సమీపాన ప్రధాన కాల్వకు అనుబంధంగా మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం నిర్మించాలని నిర్ణయించారు. ఈమేరకు కెనాల్ నిర్మాణం, తద్వారా అందుబాటులోకి వచ్చే ఆయకట్టుపై సోమవారం డ్రోన్ ద్వారా సర్వే చేపట్టారు. గ్లోబల్ సంస్థ ఆధ్వర్యాన ఈ సర్వే కొనసాగింది. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలో సుమారు 16 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

వీధి దీపాలకు మరమ్మతులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో మరమ్మతులకు గురైన వీధి దీపాలను సోమవారం గ్రామ పంచాయతీ అధికారులు సరిచేసే చర్యలు చేపట్టారు. ప్రస్తుతం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఉన్న 225 వీధి దీపాల మరమ్మత్తులకు గురైనట్లుగా అధికారులు గుర్తించి, వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు గ్రామ పంచాయతీ పనులు పూర్తి చేస్తున్నారు. వైకుంఠ ఏకాదశి ఉత్సవాల సందర్భంగా ఈ మరమ్మతులు చేపడుతున్నట్లు తెలుస్తోంది. కాగా పట్టణ వ్యాప్తంగా ఉన్న అన్ని కాలనీలో కలిపి దాదాపు 3500 వరకు వీధి దీపాలు ఉండగా, వైకుంఠ ఏకాదశి పూర్తయిన తదుపరిగా మిగిలిన వీధి దీపాలకు సంబంధించిన మరమ్మతులు చేపట్టనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

9న రైతు ప్రదర్శన

భద్రాచలంటౌన్: పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కార్యాలయంలో ఈ నెల 9న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే రైతు ప్రదర్శన పోస్టర్‌ను ఆల్ ఇండియా యునైటెడ్ కిసాన్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెచ్చెల రంగారెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారంతో పాటు రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలుచేయాలని, అటవీ హక్కుల చట్టంతో అర్హులందరికీ పోడుపట్టాలు ఇవ్వడంతో పాటు రైతు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆల్ ఇండియా యునైటెడ్ కిసాన్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రదర్శనను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కెచ్చెల కల్పన, సాయన్న, శివ, వీరభద్రం, భీమరాజు, మల్లేశ్వరి, కుమారి, శారద, భాస్కర్, శాంతమ్మ, షకీరా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి

మణుగూరురూరల్: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని దమ్మక్కపేట గ్రామ పంచాయతీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామశాఖ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ధరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా బత్తుల వినయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా కాటబోయిన శ్రీను, ఇందారపు లక్ష్మణ్, సహాయ కార్యదర్శులుగా పెనుగొండ శ్రీను, మునిగల సురేష్, కోశాధికారిగా మునిగల లక్ష్మయ్యలతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్, కోకన్వీనర్ నూకారపు రమేష్, నాయకులు ఎడ్ల శ్రీనివాస్, అక్కి నర్సింహరావు, ఆవుల నర్సింహరావు, ఎమ్.కృష్ణ పాల్గొన్నారు.

పోడులో బోర్లు వేసుకుంటాం..

చంద్రుగొండ: పోడుభూముల్లో బోర్లు వేసుకుంటాం అనుమతి ఇవ్వండి అంటూ మండలంలోని రావికంపాడు గ్రామానికి చెందిన గిరిజనులు అధికారులను కోరుతున్నారు. సోమవారం కలక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందనకు ఈ మేరకు వినతిపత్రం అందించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పోడుభూముల్లో బోర్లు వేసుకుంటున్నారని, చంద్రుగొండ మండలంలో అటవీ అధికారులు అనుమతివ్వడం లేదని వారు పేర్కొన్నారు. జిల్లా అధికారులు స్పందించి అనుమతి ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో భూక్యా హర్షా, ఇస్లావత్ వెంకన్న, అజ్మీర రమేష్, భూక్యా బుల్లి, పార్వతి, లాలి, రమేష్‌లు ఉన్నారు.

వేజ్ బోర్డు సభ్యుడిగా ప్రమాణస్వీకారం



జనక్‌ప్రసాద్‌ను సన్మానిస్తున్న పిచ్చిరెడ్డి

బూర్గంపాడు: రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యుడిగా బూర్గంపాడు మండలం సారపాక ఐటీసీలోని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర వేజ్ బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్ అధ్యక్షతన సోమవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తనకు కనీస వేతనాల సలహా మండలి సభ్యుడిగా అవకాశం కల్పించడంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, చైర్మన్ జనక్‌ప్రసాద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ గుర్తింపు కార్మికసంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ విజయానికి కృషి చేస్తానని వెల్లడించారు.

‘రైతులను మోసం చేసిన ప్రభుత్వం’



మణుగూరురూరల్: రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిన విధంగా రైతు భరోసా రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించారు. రహదారులపై బైఠాయించి ధర్నాలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రైతు భరోసా రూ.15వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రూ.12వేలు ఇస్తామని చెప్పడం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. – సాక్షి నెట్‌వర్క్



దుమ్ముగూడెం: లక్ష్మీనగరంలో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



పినపాక: సమావేశంలో మాట్లాడుతున్న మండలాధ్యక్షుడు పగడాల సతీష్‌రెడ్డి